

ఎగువ సభలో చోటు.. దక్కేనా..?



- పరిషత్‌లో 4 స్థానాలకు పెరిగిన ఆశావహులు
- ఈ సారైనా బీసీల ఆశలు ఫలించేనా?
- నేడు ఢిల్లీకి సీఎం సిద్దరామయ్య
- ముఖ్యమంత్రి మద్దతు ఎవరికో..?

బెంగళూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఏ కులమైనా ఎదగాలంటే ఉన్నత విద్యతోపాటు రాజకీయ పదవులు కీలకమని అందుకే అన్నికులాలకు ప్రాధాన్యం ఇస్తామని అన్ని రాజకీయపార్టీలు చెప్పుకొంటున్నా ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. కేవలం కొన్ని సామాజికవర్గాలకే చట్టసభలలో పదవులు వరిస్తున్నాయి. శాసనసభలో వెనుకబడిన వర్గాలకు చెందిన కొన్ని కొలాలకు చెందినవారికి టిక్కెట్లు కేటాయించడం అసాధ్యం. నియోజకవర్గాలలో వారి సామాజికవర్గానికి కనీసమైన ఓటుబ్యాంకు ఉండదని పార్టీలు వెనుకడుగు వేస్తాయి. ఇలా బీసీ సామాజికవర్గంలో ఎన్నో కులాలు శాసనసభలో అడుగుపెట్టడం సవాల్‌గా ఉంది. ఒకరిద్దరు ఏదో ఒక పలుకుబడితోనూ, ప్రత్యామ్నాయమైన రాజకీయాల్లో పేరొందాక చట్టసభలకు వెళ్లే పరిణామాలు ఎక్కువగా ఉంటాయి. అయితే పెద్దలసభగా పేరొందిన విధానపరిషత్‌లో చిన్నకులాలకు చెందినవారికి అవకాశం కల్పించడం సముచితమనే అభిప్రాయాలు ఉన్నాయి. అయితే పలు సందర్భాల్లో పరిషత్‌కు వచ్చేవారు కూడా వ్యాపార, పారిశ్రామిక, విద్యానిపుణులే ఎక్కువగా ఉంటున్నారు. ఆర్థికంగా స్థితిమంతులైనవారే పరిషత్‌లోకి ప్రవేశిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. శాసనసభకు టిక్కెట్ దక్కని లేదా ఓటమి చెందిన సీనియర్ నేతలకు ప్రత్యామ్నాయ రాజకీయ అవకాశం కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే అల్పసంఖ్యాత, హిందుళిద, దళిత (అహింద) నాయకుడిగాను బీసీ కులాలకు ఛాంపియన్‌గా చెప్పుకొనే సిద్దరామయ్య పలు సందర్భాలలో బీసీ వర్గాలకు అవకాశం ఇచ్చారు.

బీజేపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యుల పేర్లు రాష్ట్రనాయకుల సిఫారసులకు అవకాశం లేకుండా పోయింది. గడిచిన పదేళ్లలో కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్సీ, రాజ్యసభ సభ్యులను ఊహకు అందనివారిని ఎంపిక చేస్తూ వచ్చారు. మారుమూల ప్రాంతాలలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలతో దశాబ్దాలకాలం పనిచేసినవారికి అవకాశం కల్పించారు. ప్రతిసారి రాష్ట్రనాయకులు వారి వారసులు లేదా పార్టీకోసం పనిచేసి ఎన్నో పదవులు అనుభవించినవారి పేర్లను సిఫారసు చేస్తూ వచ్చారు. కానీ రాష్ట్రనేతల సిఫారసులను పక్కకుపెట్టి కొన్నేళ్లకాలం ముగిసింది. కాంగ్రెస్‌లో ఇటువంటి సంస్కృతి లేదు. పార్టీలో వివిధ హోదాలలో కొనసాగినవారికి అవకాశాలు దక్కుతూ వచ్చాయి. అయితే సీఎం సిద్దరామయ్య అహింద నేతగా రాణిస్తున్న తరుణంలో ఏ విధమైన నిర్ణయం తీసుకుంటారనేది కీలకమవుతోంది. ప్రస్తుతం నాలుగు ఎమ్మెల్సీ స్థానాలు భర్తీ చేయాల్సి ఉంది. ఇందుకోసం ఏకంగా వందమందికిపైగానే పోటీ పడుతున్నారు. సీఎం, డీసీఎంలతోపాటు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సహా అధిష్ఠానంలోని పలువురు నేతల ద్వారా సిఫారసులకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. తాజాగా ఎమ్మెల్సీ పదవీకాలం ముగిసిన యుబీ వెంకటేశ్, ప్రకాశ్‌రాథోడ్‌లు మరోసారి ప్రయత్నిస్తున్నారు. జేడీఎస్‌కు చెందిన కేఎం తిప్పేస్వామి పదవీకాలం ఇటీవలే ముగిసింది. బీజేపీకి చెందిన సీపీ యోగేశ్వర్ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరి చన్నపట్టణ ఎమ్మెల్యే అయిన విషయం తెలిసిందే. ఇలా నాలుగు స్థానాల భర్తీకోసం రేసులో ఉండేవారిలో ప్రధానంగా బీఎల్ శంకర్, వీఆర్ సుదర్శన్, సాధుకోకిల, సంగీతకట్టి, బాలరాజనాయక్, వినయ్‌కార్తీక్, బీఎం సందీప్, సీఎస్ ద్వారకనాథ్, రమేశ్ బాబు, సూరజ్‌హెగ్డే, ఎల్ నారాయణ్, ఐశ్వర్యా మహదేవ్, విజయ్ ములుగుండ్, కమలాక్షి రాజణ్ణ, పుష్ప అమరనాథ్, ఆరతి కృష్ణ ఉన్నారు. వీరిలో ఒక్కొక్కరు రాష్ట్ర, కేంద్ర అగ్రనేతలకు ప్రధాన అనుచరులుగా గుర్తింపు పొందినవారు ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలలో ఓబీసీ కేటగిరీలో 9మంది, ఒక్కలిగ 8మంది, లింగాయత 7, ముస్లిం 4, ఎస్సీ 3, ఎస్టీ 1, క్రిస్టియన్ ఒకరు ఉన్నారు. ఓబీసీలో గొల్ల 2, ఈడిగ 2, రాజుక్షత్రియ 1, బలిజ 1, కురుబ 1, బెస్త 1, దేవాంగం 1 ఉన్నారు. సుమారు పది ప్రముఖ కులాలకు చెందినవారికి పరిషత్‌లో చోటు లేదు. అహింద నేత సీఎం సిద్దరామయ్య ఏ విధంగా నిభాయిస్తారనేది వేచి చూడాల్సి ఉంది.

నేడు ఢిల్లీకి సీఎం



ఢిల్లీలో నూతనంగా నిర్మించిన కావేరి భవన్ ప్రారంభానికి సీఎం సిద్దరామయ్య బుధవారం వెళ్తున్నారు. దాదాపు మూడు నెలల తర్వాత సీఎం రాష్ట్రం వీడి ప్రయాణిస్తున్నారు. గురువారం అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేలతో సీఎం సిద్దరామయ్య భేటీ కానున్నారు. ఇదే సందర్భంలోనే రాష్ట్రంలో ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలు హనీట్రాప్ అంశం చర్చకు వచ్చే అవకాశం ఉంది. మంత్రివర్గంలో మార్పులు, ఎమ్మెల్సీల పేర్లు ఖరారు వంటి అంశాలు చర్చించనున్నట్లు తెలుస్తోంది. డీసీఎం డీకే శివకుమార్‌తో పాటు పలువురు మంత్రులు, ఆశావహులు ఢిల్లీకి బయల్దేరేందుకు సిద్ధమయ్యారు.

అర్జీ సమర్పించిన 30రోజుల్లోగా ఈ-ఖాతా



మీడియాతో ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు

దొడ్డబళ్ళాపుర, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): దొడ్డబళ్ళాపుర, బాశెట్టిహళ్ళి పట్టణ పంచాయతీల పరిధిలో ఈ-ఖాతా అభియాన చేపట్టామని అర్జీ సమర్పించిన 30రోజుల్లోగా ఈ-ఖాతా ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు వెల్లడించారు. పట్టణంలోని తాలూకా పంచాయతీ ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు పట్టణ, స్థానిక సంస్థల పరిధిలోని అధికారిక, అనధికారిక ఆస్తులకు ఆస్తి పన్ను చెల్లించడం, ఇ-ఖాతాపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఈ మేరకు దొడ్డబళ్ళాపుర పట్టణ పరిధిలోని ఆస్తులకు నగరసభ నుంచి ఇ-ఖాతా అభియానలో మీ వార్డులలో నిర్ణీత రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5వరకు తగిన రికార్డులు సమర్పించి ఇ-ఖాతా పొందవచ్చునన్నారు. ఇ-ఖాతా పొందేందుకు కనీసంగా ఆస్తికి సంబంధించి యాజమాన్య హక్కులు కలిగిన రిజిస్టర్డ్ విక్రయ పత్రాలు, దానపత్రాలు, ప్రభుత్వం లేదా మండలుల నుంచి కేటాయించిన హక్కుపత్రాలు, మంజూరుపత్రాలు, రెవెన్యూశాఖ నుంచి 94 సిసి కింద ఇచ్చిన హక్కుపత్రం వంటివి సమర్పించాల్సి ఉంటుందన్నారు. తాజా ఆస్తి పన్ను రశీదు, స్థలం లేదా భవనం ఫోటో, యజమాని ఫోటో, యజమాని గుర్తింపు కార్డు, బి-రిజిస్టర్‌లోని ఆస్తులకు సంబంధించి ఇ-ఖాతా పొందేందుకు ఆస్తికి సంబంధించిన యాజమాన్య రుజువు కలిగిన రికార్డులు, 10.9.2024కు ముందు నమోదైన రిజిస్టర్డ్ విక్రయపత్రాలు, దానపత్రాలు, విభాగం పత్రాలు, హక్కు పత్రాలు, ఇతరత్రా ప్రమాణపత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. బాశెట్టిహళ్ళి పట్టణ పంచాయతీలో ఈనెల 3నుంచి ఇ-ఖాతా అభియాన ఉంటుందని, నగరసభ పరిధిలో 4నుంచి 22వరకు ఆయా వార్డులలో ఉంటుందని వివరించారు.

సస్పెన్షన్ ఎత్తివేయండి

- బీజేపీ ఎమ్మెల్యేలకు మద్దతుగా స్పీకర్‌కు యత్నాళ్ లేఖ

బెంగళూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): శాసనసభలో నిబంధనలు ఉల్లంఘించారని వేటు వేసిన 18మంది బీజేపీ ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను ఉపసంహరించాలని విజయపుర ఎమ్మెల్యే బసనగౌడపాటిల్ యత్నాళ్ కోరారు. ఈమేరకు స్పీకర్‌కు మంగళవారం ఓ ప్రత్యేకమైన లేఖను పంపారు. శాసనసభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య ఆరోగ్యకరమైన చర్చలు జరగాలన్నారు. ప్రతిపక్షాలు ప్రజలధ్వనిగా నిరసనలు చేపడతారని, కానీ సభ్యత పాటించాల్సిన అవసరం ఉందన్నారు. వేటుకు గురైన 18మందిలో కొత్తవారు ఎక్కువమంది ఉన్నారని లేఖలో ప్రస్తావించారు. కఠినమైన నిర్ణయంలో మార్పు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేలు ఇటీవల కొన్ని రోజులుగా ఒత్తిడికి గురవుతున్నారన్నారు. సస్పెన్షన్ రద్దుతో ప్రజాప్రభుత్వ సిద్ధాంతాలకుగానీ, శాసనసభ బద్ధతకు ఎక్కడా ఆటంకం ఉండదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు వారి నియోజకవర్గాలలో ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటునుంచి ఉపశమనం కలిగించాలని లేఖలో కోరారు. ఇదే విషయాన్ని ఎక్స్ ద్వారా యత్నాళ్ అభిప్రాయపడ్డారు.

స్లౌ..చ్ క్యాప్..!

- ఎట్టకేలకు రద్దు కానున్న బ్రిటీష్ కాలం నాటి స్లౌచ్ టోపీలు
- కానిస్టేబుళ్ల క్యాప్ మార్పునకు ప్రభుత్వం కసరత్తు
- 4న ప్రత్యేక సమావేశంలో తుది నిర్ణయం




స్లౌచ్ టోపీలతో కానిస్టేబుళ్ల బృందం (ఫైల్)

బెంగళూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్రంలో పోలీసులు వాడుతున్న టోపీలు మనవి కాదు..బ్రిటీష్ వారి నుంచి కాపీ కొట్టినవే..ఎన్నో ఏళ్లుగా వీటిని మర్చాలన్న డిమాండ్ ఉంది. ఇన్నేళ్ల తర్వాత కొత్త టోపీలకు మోక్షం రానుంది. రాష్ట్ర పోలీస్‌శాఖలో కానిస్టేబుళ్లు ధరిస్తున్న టోపీల మార్పునకు ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేపట్టింది. బ్రిటీష్ వారి కాలంలో దేశమంతటా స్లౌచ్ క్యాప్‌లను ఉపయోగించేవారు. పలు రాష్ట్రాలలో మార్పులు వచ్చేశాయి. కానీ రాష్ట్రంలో మాత్రం అవే టోపీలను కొనసాగిస్తూనే ఉన్నారు. పోలీసు సిబ్బంది దశాబ్దాలకాలంగా టోపీ మార్చాలని డిమాండ్ చేస్తున్నా పలు కారణాలతో అది అమలు కాలేదు. ఇటీవలే ఈ డిమాండ్ పెరగడంతో డీజీపీ అలోక్‌మోహన్ కానిస్టేబుళ్ల క్యాప్‌ల మార్పు విషయమై పరిశీలించాలని ఆదేశించారు. పోలీస్‌కిట్ నిర్ణయ కమిటీ సభ్యులు ఏప్రిల్ 4న ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. దీంతో టోపీ మార్పు అంశానికి వారు సుముఖత వ్యక్తం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. పోలీసుశాఖలో కానిస్టేబుళ్ల టోపీ మార్పు అంశం కొత్తేమీకాదు. గతంలోనూ పలు సందర్భాలలో ఉన్నతాధికారులకు విన్నవించారు. అయితే లక్షలాది స్లౌచ్ క్యాప్‌లు సిద్ధంగా ఉండడంతో అధికారులు వాటిని మార్పు చేసేందుకు వెనుకడగు వేస్తూ వచ్చారు.

స్లౌచ్ క్యాప్‌లకు ఎంతో చరిత్ర..



రాష్ట్రంలో పోలీస్ కానిస్టేబుళ్లు ఉపయోగించే స్లౌచ్ క్యాప్‌లకు శతాబ్దపు చరిత్ర ఉంది. మైసూరు మహారాజు కాలంలో రాష్ట్ర పోలీసుశాఖ ఖాకీ షర్టు, నిక్కరు, నీలిరంగు పేటా, నల్ల బూట్లు ధరించేవారు. స్వాతంత్ర్యం తర్వాత కూడా పోలీసులు అదే సంప్రదాయం కొనసాగింది. 1980-83 మధ్య కాలంలో ముఖ్యమంత్రి ఆర్ గుండూరావు పాలనలో అప్పటివరకు ఉన్న నీలంరంగుపై ఎర్రపట్టీలతో ఉండే టర్బన్‌లకు బదులుగా స్లౌచ్ క్యాప్‌లను నిత్యం విధులలో పాల్గొనే సందర్భంలో పరిచయం చేశారు. అయితే పరేడ్ తదితర సందర్భాలలో మాత్రం టర్బన్‌లను వినియోగించేవారు. ఖాకీ నిక్కరుకు బదులు ప్యాంట్లు వచ్చాయి. 2018లో టోపీలను పూర్తిగా మార్చాలని నిర్ణయించారు. కానీ మార్పుల విషయం ప్రస్తావనకు రాకపోవడంతో అప్పటికే లక్షలాది క్యాప్‌లు సిద్ధంగా ఉండేవి. అవి వృథా అవుతాయని మరోసారి వాయిదా వేశారు. పాతకాలం నాటి కానిస్టేబుళ్ల క్యాప్‌లు ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని స్లౌచ్ హ్యాట్‌లను మార్చాలని కేంద్ర ఆరోగ్యశాఖ హెచ్చరించింది. దీనికి తోడు నిరసనలు, ర్యాలీలు, నేరస్తులను పట్టుకునేందుకు వెళ్లిన సమయంలో స్లౌచ్ హ్యాట్‌లు ఉపయోగించడం ఇబ్బందికరమనే అభిప్రాయాలు ఉన్నాయి. క్యాప్ కిందపడితే యూనిఫాంకు భంగం కలిగించినట్లుగా భావిస్తారు. క్యాప్‌లకు ఎలాస్టిక్ వంటి వస్తువులు ఉపయోగించి తలనుంచి జారిపడకుండా ఉండేలా తయారు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సివిల్ పోలీస్ కానిస్టేబుళ్లకు ఖాకీ రంగు, ట్రాఫిక్ పోలీసులకు తెలుపురంగు టోపీలు ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతానికి ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో కానిస్టేబుళ్లకు పీక్ క్యాప్‌లను ఇస్తున్నారు. అదే తరహాలోనే రాష్ట్ర పోలీసులకు ఇవ్వాలనే డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యేక సభ జరగనుంది. ఈ డిమాండ్ ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోంది. కేఎస్‌ఆర్‌పీ ఏడీజీపీ అధ్యక్షతన జరిగే సమావేశంలో కానిస్టేబుళ్ల క్యాప్‌ల మార్పు కొలిక్కి వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఇన్నేళ్లకయినా పాత టోపీల స్థానంలో కొత్తవి రాబోతున్నాయని సిబ్బందిలో హర్షం వ్యక్తం అవుతోంది. సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.



శివకుమార స్వామీజీ జయంతి వేడుకల్లో కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, సోమణ్ణ, డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

ఆదర్శప్రాయుడు శివకుమార స్వామీజీ

- స్వామీజీకి భారతరత్న ఇవ్వాలి
- జయంతి వేడుకల్లో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్

బెంగళూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సిద్దగంగా మఠం ద్వారా దశాబ్దాలకాలం పాటు ఉచిత విద్య, వసతి, భోజనం సమకూర్చి లక్షలాదిమంది పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపిన శివకుమారస్వామిజీ ఆదర్శప్రాయులని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. శివకుమారస్వామీజీ 118వ జయంతి వేడుకలలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. మంగళవారం 'గురువందన' పేరిట మఠంలో నిర్వహించిన కార్యక్రమంలో మఠాధిపతి సిద్దలింగస్వామీజీ పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి. డీసీఎం డీకే శివకుమార్, కేంద్రమంత్రి సోమణ్ణ, రాష్ట్ర మంత్రులు పరమేశ్వర్, రాజణ్ణలతో పాటు ఎమ్మెల్యేలు తదితరులు స్వామీజీ సమాధికి పూజలు జరిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ నడిచే దేవుడిగా శివకుమారస్వామీజీ కొనియాడారంటే ఎంతోమందికి నిస్వార్థంగా సేవలందించడంతోనే సాధ్యమైందన్నారు. డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ స్వామీజీ 'భారతరత్న'కు అర్హులని రక్షణ మంత్రి ద్వారా కేంద్రప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. మఠం పూర్వ విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్నవారు, స్వామీజీ అభిమానులు వేలాదిమంది భాగస్వామ్యులయ్యారు. జయంతి వేడుకలలో ఐదు ప్రాంతాలలో అన్నదానం ఏర్పాటు చేశారు. సుత్తూరు మఠాధిపతి శివరాత్రి దేశికేంద్రస్వామిజీ తదితరులు భాగస్వామ్యులయ్యారు.

స్మరించుకున్న ప్రధాని

శివకుమారస్వామీజీ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్మరించారు. స్వామిజీ కారుణ్యం, దానం, సేవలతో దారిదీపాన్ని ఏర్పాటు చేశారన్నారు. నిస్వార్థ సేవ సమాజానికి ఎలా చేయాలనేది స్వామిజీ ఆచరించి చూపారని 'ఎక్స్'లో అభిప్రాయపడ్డారు. సీఎం సిద్దరామయ్య, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పతోపాటు పలువురు ఎక్స్ ద్వారా స్వామీజీ జయంతిని స్మరించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కేరళ వాసుల దుర్మరణం



ముస్కాన్, షాహిద్ (ఫైల్)

బెంగళూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): చామరాజనగర జిల్లా గుండ్లుపేట తాలూకా పరిధిలోని జాతీయ రహదారి 766పై మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేరళకు చెందిన ఇద్దరు దుర్మరణం చెందారు. రంజాన్ పండుగకు స్వస్థలానికి వెళ్లి.. తిరిగి మైసూరుకు వస్తుండగా ఈ ఘోరం జరిగింది. కేరళకు చెందిన ఎనిమిది మంది కుటుంబ సభ్యులు మైసూరు వైపు కారులో వస్తుండగా, నంజనగూడు నుంచి ఊటికి వెళ్తున్న టెంపో ట్రావెలర్ ఎదురుగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న షాహిద్ (30) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన ముస్కాన్(19) మైసూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. గాయపడిన మిగిలిన ఆరుగురిని మైసూరుకు తరలించారు. నంజనగూడు తాలూకా నగరెలె గ్రామానికి చెందిన టెంపో ట్రావెలర్ డ్రైవర్ సాగర(32) కాళ్లు విరిగాయి. ఆ వాహనంలో ఉన్న ఐదారుగురు గాయపడ్డారు. బేగూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఉల్లాల.. వన్యప్రాణులు విలవిల



ఎక్కడ చూసినా చుక్కనీరు లేదే..

బెంగళూరు నగరంలోని కీలక చెరువుల్లో ఒకటైన ఉల్లాల చెరువు ఎండిపోయింది. చుక్కనీరు లేకుండా రాళ్లు బయటపడ్డాయి. దీంతో చెరువులోని వన్యప్రాణులు దాహంతో విలవిలలాడుతున్నాయి. ముఖ్యంగా అందాలు పంచే నెమళ్లు దాహంతో విలవిలలాడుతున్నాయి..పురులు విప్పి నాట్యమాడే మయూరాలు చుక్క నీటికీ నోచుకోవడం లేదు. నగరంలోని కెంగేరి ప్రాంతం ఉల్లాల చెరువులో వన్యప్రాణులు దాహార్తితో విలవిలలాడుతున్నాయి. వర్షాకాలంలో వచ్చిన నీరు ఫిబ్రవరికే ఇంకిపోయింది. బీబీఎంపీ లక్షల రూపాయలు ఖర్చు చేసి మురుగునీరు శుద్ధీకరించి చెరువులకు వదిలే పనులు నాసిరకం కావడంతో రాళ్లు, రప్పలూ తేలిపోయి ఎడారిని తలపిస్తోంది. దీంతో వన్యప్రాణులు నీరు లేక విలవిలలాడుతున్నాయి. ఉల్లాల చెరువులో 25కుపైగా నెమళ్లు, కుందేళ్లు, తాబేళ్లతోపాటు 20 రకాల పక్షులు తాగునీటికోసం తల్లడిల్లుతున్నాయి. అధికారులు తగిన ఏర్పాట్లు చేసి పక్షల దాహార్తి తీర్చాలని నగరవాసులు కోరుతున్నారు.

(బెంగళూరు, ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్)





రాళ్లు, మట్టితో నిండిన ఉల్లాల చెరువు



కళ్లు ఎన్ని ఉన్నా.. కానరాని నీళ్లు..



ఏమి హాయిలే..

నా డౌటు ఏమంటే..
ఎండకు తట్టుకోలేక
నిండా మునిగాం కదా..?
కొంగా..! నువ్వెందుకు
ముడుచుక్కూర్చున్నావ్..?
గజగజా వణికించే చలి అన్నట్లు..!

(అనంతపురం శివారులోని పండమేరు వంకలో సేదదీరుతున్న ఎనుములు)

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



ప్రశాంతంగా ఉండనీవా..? ఏమైనా పద్ధతేనా..?

ఇంటికోసం దరఖాస్తు చేసుకోండి

హౌసింగ్ పీడీ శైలజ



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థలం ఉన్న వారు ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ పీడీ శైలజ కోరారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రశ్న: పేదల గృహ నిర్మాణానికి ఉన్న ప్రభుత్వ పథకాలు?
పీడీ: ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఉన్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఉండే పేదలు ఈ పథకాలకు అర్హులు.

ప్రశ్న: కొత్త ఇళ్ల కోసం ఎప్పుడు దరఖాస్తు చేసుకోవాలి......?
పీడీ: భార్య, భర్తల ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డు, ఎన్‌పీఐసీకి లింక్ అయిన భార్య బ్యాంకు అకౌంట్ పాసుబుక్, స్థలం పట్టా, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డుకు అనుసంధానం అయిన ఫోన్ నంబరు, పాన్‌కార్డులతో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను ఆయా మండల ఎంపీడీఓ, తహసీల్దార్, హౌసింగ్ ఏఈలు సభ్యులుగా ఉండే మల్టీ డిసిప్లైన్ టీం పరిశీలన చేసిన అనంతరం పీడీ కార్యాలయానికి పంపుతారు. ఆసక్తి, అర్హతగల సొంత స్థలం ఉండే వారు హౌసింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలి.

ప్రశ్న: కొత్త ఇళ్ల నిర్మాణాలకు ఎంత మొత్తం చెల్లిస్తారు.....?
పీడీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా హౌసింగ్ నిర్మాణాలకు సంబంధించి రూ.2.5లక్షలు చెల్లిస్తారు. ఇందులో ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు మొత్తాన్ని అందిస్తారు.

ప్రశ్న: వైసీపీ ప్రభుత్వంలో ఎన్ని లే అవుట్లలో ఎన్ని ఇళ్లు మంజూరు చేశారు? ఎన్ని పూర్తి చేశారు ?
పీడీ: 2019-24 మధ్య కాలంలో జిల్లాలో 412లే అవుట్లలో 41,351ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో 13,472ఇళ్లు పూర్తి చేశారు. మిగిలిన 27,878ఇళ్లు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

ప్రశ్న: వైసీపీ ప్రభుత్వంలో అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్ల పరిస్థితి ఏమిటి...?
పీడీ: గత ప్రభుత్వంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. బీసీ, ఎస్సీలకు అదనంగా రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా రూ.75 వేలు ఆర్థిక సహాయం అందిస్తోంది. దీంతో లబ్ధిదారులను చైతన్యం చేసి అసంపూర్తి ఇళ్లను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: హౌసింగ్ లబ్ధిదారులకు అదనపు సాయం ఎంతమందికి, ఎంత అందజేశారు....?
పీడీ: మొదటి విడతలో 6080మంది లబ్ధిదారులకు రూ.9.11కోట్లు నిధు లు మంజూరు చేశారు. ఇప్పటికే 4వేల మంది లబ్ధిదారులకు రూ.5.94కోట్లు వారి ఖాతాల్లో జమచేశారు. అయితే సొమ్ము పడిన లబ్ధిదారులను చైతన్యం చేసి అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని ఇంజనీర్లకు సూచించారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బుక్కపట్నం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో ఖాళీగా ఉన్న 17 అధ్యాపక పోస్టుల్లో డెప్యుటేషన్‌పై పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ, మున్సిపల్, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, ఎంఈఓలు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన, 58 సంవత్సరాల వయసువారు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 16, 17 తేదీల్లో రాత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 17న ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9949993712 నంబరులోగానీ, డీఈఓ కార్యాలయంలోగానీ సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.



మార్కెట్‌కు వచ్చిన చింత పండు

- రంగు తగ్గిందని పడిపోయిన ధర
- క్వింటానికి రూ.7వేల వరకు తగ్గింపు
- గిట్టుబాటు కాలేదని రైతుల ఆందోళన

రైతుకు చింతేనా..?



హిందూపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): చింత ధరలు పడిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు వస్తున్న చింత పండు ధరలు వారం వారం తగ్గుతూ వస్తున్నాయి. మార్కెట్ ప్రారంభంలో ఆశించిన మేర ధరలు పలికాయి. మార్చిలో మరింత ధర పెరుగుతుందని రైతులు ఆశించారు. కానీ ఫిబ్రవరి, మార్చి ఆఖరికి ధరలతో పోల్చితే మేలురకం కర్పూళి క్వింటాల్‌పై రూ. 7 వేల దాకా ధరలు తగ్గడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పురం వ్యవసాయ మార్కెట్ యార్డుకు జిల్లా నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున చింతపండు వస్తుంది. ఇక్కడికి కర్పూళి రకం ఎక్కువగా వస్తుంది. గురువారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు 1700 క్వింటాళ్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అనధికారికంగా సుమారు 4 వేల క్వింటాళ్ల వరకు వచ్చినట్లు అంచనా. మేలు రకం కర్పూళి క్వింటాల్ రూ. 27 వేలు పలికింది. రెండో రకం రూ. 13 వేలు, మూడోరకం రూ. 8,100 పలికాయి. మార్కెట్‌కి వచ్చిన ఫ్లవర్ రకంలో మొదటిది రూ. 12,500, రెండోది రూ. 7500, మూడోరకం రూ. 4,500 పలికాయి. ఇదే చింతపండు మార్చి 10న మేలు రకం క్వింటాల్ ధర రూ. 40 వేలు, 12న రూ. 33 వేలు పలికింది. ఫిబ్రవరి నెలలో మేలు రకం రూ. 33 వేలు, రెండో రకం రూ. 15 వేల దాకా పలికాయి. ఈ లెక్కన క్వింటాల్‌పై రూ. 7 వేలకు పైగానే ధరలు తగ్గినట్లు రైతులు చెబుతున్నారు.

రంగు తగ్గిందని..

సాధారణంగా మార్చి నెలలో చింతపండు రంగు బాగుంటుంది. అకాల వర్షాల కారణంగా కొంత వరకు రంగుమారింది. దీనిని సాకుగా చూపి క్వింటాల్‌కు రూ. 7 వేల దాకా ధర తగ్గించడం అన్యాయమని రైతులు వాపోతున్నారు. బయటి వ్యాపారులు రాలేదంటే స్థానిక వ్యాపారులే కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకోవాల్సి వచ్చింది. మార్చి నుంచి ఏప్రిల్ 15 వరకు చింత పండు నాణ్యంగా ఉంటుంది. ఈ సమయంలో రంగు బాగా ఉంటుంది. కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ ఉంచుతారు. అనంతరం కర్నూలు, విజయవాడ, నెల్లూరు, చిత్తూరు తమిళనాడు ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసి నిల్వ చేస్తారు. ఈసారి బయటి వ్యాపారులు రాలేదని తెలుస్తోంది.

ఆలస్యంగా మార్కెట్ ప్రారంభం

సాధారణంగా ప్రతి ఏడాది జనవరి నెలలోనే చింతపండు మార్కెట్‌కి వస్తుంది. కానీ ఈసారి ఫిబ్రవరి 2వ తేదీ మార్కెట్ ప్రారంభించారు. మార్చిలో ధరలు తగ్గడం వెనక కారణాలు ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా తక్కువ సరుకు ఉన్న రైతులు ఉగాది పండుగ ముందు వారంలో మార్కెట్‌కి తీసుకువచ్చి విక్రయిస్తారు. ఈసారి మార్చి 15 తరవాత వచ్చిన రైతులకు చింతే మిగిలింది.

కూలి కూడా గిట్టదు

ప్రస్తుతం చింత చెట్టు నుంచి కాయలు కోయాలంటే ఒక్కో కూలికి రూ. 1000 నుంచి రూ. 1200 ఇవ్వాలి. కాయలు ఏరేందుకు మహిళలకు రూ. 500 కూలి ఇవ్వాలి. కోసిన చింతకాయను కట్టికాయ చేయడానికి కూలికి రూ. 700 ఇవ్వాలి. కట్టి కాయను కర్పూళి చేసేందుకు కిలోకి రూ. 30 ఇవ్వాలి. ఇలా కూలీలు లెక్కిస్తే రైతుకి గానీ, చింతచెట్టు కొనుగోలు చేసిన వారికి కానీ మిగిలేదేమీ ఉండదు. ఈసారి అనుకున్న రీతిలో చింత ఫలసాయం అందలేదు. సాధారణంగా కొన్ని చింత చెట్ల నుంచి తెచ్చిన 10 కిలోల కట్టి కాయను కొడితే 6 నుంచి 7 కిలోలు వచ్చేది. ఇప్పుడైతే 5 నుంచి 5.5 కిలోలకే పడిపోయింది. దీనివల్ల 10 కిలోల కట్టి కాయకు 300 దాకా నష్టం వస్తుంది. మార్కెట్‌కు తీసుకెళితే మార్కెట్ కూలీలు, కమీషన్లు లెక్కిస్తే రైతులకు మిగిలేదేమీలేదు. చింతపండుతో ఈసారి నష్టమే తప్పా లాభం లేదు.

ఈ ఏడాది పంట నష్టమే



ఒకే చెట్టులోని చింత పండు మూడు వారాలుగా తీసుకు వస్తున్నా. మొదటి వారం రూ. 22 వేలు, రెండో వారం రూ. 20 వేలు, గురువారం రూ. 16 వేలు ధర పలికింది. ఈ లెక్కన క్వింటాల్‌పై ఐదారు వేల వరకు నష్టపోయాను. దీనికి తోడు కూలీలు రేట్లు విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వం చింతపండుకు ధర నిర్ణయిస్తే తప్పా భవిష్యత్తులో చింత రైతులకు మిగిలేదు ఏమీ ఉండదు.

- గోవిందప్ప, శిర మండలం

రెండువారాల్లో రూ. 7 వేలు తగ్గింది



రెండు వారాల క్రితం హిందూపురం మార్కెట్‌కి కర్పూళి రకం తీసుకు వస్తే రూ. 23 వేలు పలికింది. అదే చెట్టులోని కాయ గురువారం రూ. 16 వేలు పలికింది. ఈ లెక్కన క్వింటాల్‌కి రూ. 7 వేలు తగ్గింది. దీంతో లాభం వచ్చే పరిస్థితి లేదు. ఇలా అయితే చింత చెట్టు దులుపడం కూడా మానేయాలి.

- సూలప్ప, రైతు, గుడిబండ

ఆనందమానంద మాయె..!



బడి జీవితం ముగిసింది.. ఇక కాలేజీలో కలుద్దాం నేస్తం..





ఉపశమనం.. ఎండ నుంచి.. పరీక్షల నుంచి..

ముగిసిన పది పరీక్షలు

పది పరీక్షలు ముగిశాయి. ఇన్నాళ్లూ పుస్తక ప్రపంచంలో మునిగి తేలిన విద్యార్థులు హాయిగా.. స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకున్నారు. అందరి ముఖాలు ఆనందంతో వికసించాయి. బడి దాటి.. కాలేజీ కాంపౌండ్‌లోకి అడుగుపెట్టబోతున్న అందరూ.. ఇన్నాళ్లూ కలిసి చదివిన తమ ఆత్మీయ మిత్రులతో సెల్ఫీలు దిగారు. షేక్ హ్యాండ్ ఇచ్చుకుని వీడ్కోలు చెప్పుకున్నారు. అనంతపురంలోని హాస్టళ్లలో ఉంటున్నవారు పెట్టే బేడ సర్దుకుని ఇంటి బాట పట్టారు. వారిని తీసుకెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో ప్రైవేటు, కార్పొరేట్ రెసిడెన్షియల్ పాఠశాలల వద్ద సందడి కనిపించింది.

400 మంది గైర్హాజరు

పదో తరగతి పరీక్షల చివరి రోజు సోషల్ పరీక్షకు 400 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 30,997 మందికిగాను 30,638 మంది పరీక్ష రాశారు. ప్రైవేట్ విద్యార్థులు 203 మందికిగాను 162 మంది హాజరయ్యారు. సిట్టింగ్ స్క్వాడ్ 32 కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ 7 కేంద్రాలను తనిఖీ చేశాయి. గత నెల 17న మొదలైన పరీక్షలు ముగియడంతో అధికారులు స్పాట్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం విద్య



పదో సెల్ఫీ



మోసేంత బరువు.. ఇక ఇంటికి..



ఇక పదమ్మా...

ఉపాధికి పంచ ప్రాధాన్యాలు

- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ
- వేసవిలో ఉపయోగకర పనులకు శ్రీకారం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఐదు ప్రాధాన్యాలతో ఉపాధి పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్, డ్వామా పీడీలకు పలు సూచనలు చేసింది. ఇందులో ప్రధానంగా పశువుల నీటి తొట్టిలు, చెరువుల పునరుద్ధరణ, ఫాంపాండ్లు, సగటు వేతనం, ఫీడర్ చానల్ నిర్మాణం చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది.

పశువుల నీటి తొట్టెలు

వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని పశువులు తాగునీటికి ఇబ్బంది పడకుండా నీటి తొట్టెలు నిర్మాణం చేపట్టనున్నారు. జిల్లాలో 646 నీటి తొట్టెల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏప్రిల్ 10 నాటికి నీటి తొట్టెల నిర్మాణం పూర్తి చేసి పైపులైన్ ద్వారా నీటిని నింపి పశువుల దాహార్తి తీర్చాలని ప్రభుత్వం ఆదేశించింది.

చెరువుల పునరుద్ధరణ

గ్రామానికి, రోడ్లకు సమీపంలో ఉన్న చెరువులను గుర్తించి వాటిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి మండలంలో 5 ఎకరాలలోపు ఉండే రెండు చెరువులను ఇలా గుర్తించి అందంగా తయారు చేయనున్నారు. మొదటి మూడు నెలల్లో కనీసం 31చెరువులు అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

ఫాంపాండ్ల నిర్మాణం

ప్రతి రైతు పొలంలో సేద్యపు నీటి కుంటలను నిర్మించాలని సంకల్పించారు. జిల్లాకు 9వేలు లక్ష్యంగా నిర్ణయించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఈ ఫాంపాండ్లు ఎంతగానో ఉపయోగపడతాయి. ఫాంపాండ్లలో నీటిని నిల్వ చేసుకుంటే భూగర్భ జలాల పెరగడంతోపాటు పశువులకు వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఏప్రిల్ నెలలో 4500, మే నెలలో 2700, జూన్‌లో 1800ఫాంపాండ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.



పశువుల నీటి తొట్టెలు

ఫీడర్ చానల్ పునరుద్ధరణ

జిల్లాలో సాగునీటి కాలువల్లో పూడిక తీత చేపట్టి రాబోయే పంట సమయానికి ఆయకట్టు చివరి పొలం వరకు సాగునీరు అందేలా ప్రతి కాలువను పునరుద్ధరించాలి. జిల్లాలో మొదటి దశలో 93 కిలోమీటర్ల ఫీడర్ చానల్ కాలువ పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించారు.

ఉపాధి కూలీకి సగటు వేతనం



ఉపాధి హామీ కూలీలకు సగటున దినసరి వేతనం రూ.300 పొందేలా గ్రూపు మార్కింగ్ ఇచ్చి కనీసం 5గంటలు పని ప్రదేశంలో ఉండాలని నిర్దేశించారు. ఇందుకు కూలీలకు, మేట్లకు కనీస అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధి పథకం సిబ్బందిపై ఉంది.

జిల్లాకు మేలు

ఉపాధి హామీ పథకంలో పంచ ప్రాధాన్యాలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పలు ఆదేశాలు ఇచ్చింది. కలెక్టర్ నేతృత్వంలో ఉపాధి పథకాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తాం. ఈక్రమంలోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు పశువుల నీటితొట్టెలు, చెరువుల పునరుద్ధరణ, ఫాంపాండ్ల నిర్మాణం, ఉపాధి కూలీకి సగటు వేతనం, ఫీడర్‌చానల్ నిర్మాణం చేపట్టాలి. వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు నీటి సదుపాయం, రైతులకు మేలు, ఉపాధి కూలీలకు కనీస వేతనం పెంపునకు పంచప్రాధాన్యాలు తోడ్పడతాయి.

- సలీంబాషా, డ్వామా పీడీ



చెరువుల పునరుద్ధరణ ఇలా

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

బడే గులామ్ అలీఖాన్ (జయంతి)



ప్రపంచ ప్రఖ్యాత హిందుస్తానీ సంగీత విద్వాంసుడు బడే గులామ్ అలీఖాన్ 1902 ఏప్రిల్ 2న అప్పటి పంజాబ్ ప్రావిన్స్ పరిధిలోని కాసూర్‌లో జన్మించారు. ఐదేళ్ళ ప్రాయంలోనే గాత్ర సంగీతంలో అభిరుచిని ప్రదర్శించిన బడే గులాం క్రమేణా గొప్పస్థాయికి ఎదిగి 20వ శతాబ్దపు తాన్‌సేన్‌గా గుర్తింపు పొందారు. పాటియాలా - కాసూర్ ఘరానా, ధ్రుపద్, గ్వాలియర్ శైలి సంగీతంలో ఆయన ప్రాచుర్యం పొందారు. 'పద్మభూషణ్', సంగీత నాటక అకాడమీ తదితర అత్యున్న పురస్కారాలు అందుకున్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్యాలెస్‌లో 1968 ఏప్రిల్ 25న కన్నుమూశారు.

నామగిరిపెట్టై కృష్ణన్ (జయంతి)



నాదస్వర చక్రవర్తిగా పేరొందిన కర్ణాటక సంగీత విద్వాంసుడు నామగిరిపెట్టై కే కృష్ణన్ 1924 ఏప్రిల్ 2న తమిళనాడు రాష్ట్రం నామక్కల్ జిల్లాలోని నామగిరి పెట్టై గ్రామంలో జన్మించారు. నాదస్వర వాదనపై దేశవిదేశాల్లో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆస్థాన సంగీత విద్వాంసుడిగా సేవలందించారు. 1981లో పద్మశ్రీ పురస్కారం, ఇంకా తమిళనాడు ప్రభుత్వంచే కళైమామణి బిరుదు, సంగీత నాటక అకాడమీ అవార్డు, ఇసై పెరారిగ్నర్ తదితర గౌరవాలు అందుకున్నారు. 2001 ఏప్రిల్ 30న కన్నుమూశారు.

యద్దనపూడి సులోచనారాణి (జయంతి)



ప్రముఖ తెలుగు నవలా రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి 1940 ఏప్రిల్ 2న కృష్ణా జిల్లా మొవ్వ మండలం కాజ గ్రామంలో జన్మించారు. ఆలుమగల మధ్య ప్రేమలు, కుటుంబ కథనాలు రాయడంలో తనకు వేరెవరూ సాటిరారని ఆమె నిరూపించారు. 'చిత్ర నళినీయం' అనే కథతో తన సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆమె ఐదు దశాబ్దాల కాలంలో దాదాపు 80 నవలలు రచించారు. ఉత్తమ కథా రచయిత్రిగా నంది అవార్డు అందుకున్నారు. సెక్రటరీ, మీనా, జీవన తరంగాలు, జై జవాన్, ఆత్మగౌరవం వంటి నవలలు సినిమాలు, టీవీ సీరియళ్ళుగా వచ్చాయి. 2015లో హంస పురస్కారాన్ని అందుకున్నారు. 2018 మే 18న గుండెపోటుకు గురై కన్నుమూశారు.

అజయ్ దేవగన్ (పుట్టినరోజు)



బాలీవుడ్‌లో అజయ్ దేవగన్‌గా ఖ్యాతి పొందిన విశాల్ వీరు దేవగన్ 1969 ఏప్రిల్ 2న న్యూఢిల్లీలో పంజాబీ కుటుంబంలో జన్మించారు. నటుడిగానూ, నిర్మాతగానూ, దర్శకుడిగా పేరొం దారు. పలు బాలీవుడ్ హిట్ సినిమాల్లో ఆయన నటించారు. రెండు జాతీయ అవార్డులు సహా 32 అవార్డులను తన ఖాతాలో వేసుకున్నారు. ఇందులో మూడు ఫిలింఫేర్, జస్రత్ అవార్డు, పద్మశ్రీ తదితర పురస్కారాలు ఉన్నాయి. 2000లో తన సొంత బ్యానర్ అజయ్ దిగ్విజయ్ ఫిలింస్‌ను ఏర్పాటు చేసుకున్నారు. 2024లో 'సింగం అగైన్' సినిమా అత్యధిక వసూళ్లు చేసిన సినిమాలలో ఒకటిగా నిలిచింది. ఫూల్ ఔర్ కాంటే, దీవాంగీ, ఖాకీ, కాళ్, వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ ముంబై, సింగం, తన్హాజీ సినిమాలు ఎంతో గుర్తింపు ఇచ్చాయి.

సమాజాభివృద్ధే శివకుమార స్వామీజీ లక్ష్యం

త్రివిధ దాసోహికి ఘన నివాళులు



శివకుమారస్వామీజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

బెంగళూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): విద్యతో సమాజ అభివృద్ధి సిద్దగంగా స్వామిజీ లక్ష్యమని గ్యారెంటీ పథకాల కమిటీ అధ్యక్షుడు హెచ్ఎం రేవణ్ణ పేర్కొన్నారు. రాజాజినగర్‌లోని డాక్టర్ శివకుమారస్వామిజీ ట్రస్టు ఆధ్వర్యంలో స్వామిజీ 118వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం విగ్రహానికి పుష్పాంజలి ఘటించి మాట్లాడారు. రైతులు, పశువులు కష్టాల నివారణకు స్వామిజీ ఎంతో ఆసక్తి చూపారన్నారు. సిద్దగంగాలో పెద్ద జాతర జరిగేదని చుట్టుపక్కల గ్రామాలకు చెందినవారు ఎడ్లతో జాతరకు వచ్చేవారన్నారు. రాత్రి జగజ్యోతి బసవేశ్వర నాటకం వీక్షించి మహామంగళారతి అనంతరం బయల్దేరేవారన్నారు. 18వేలమందికిపైగా విద్యాదానం చేస్తున్న రాష్ట్రంలోని అతిపెద్ద త్రివిధ దాసోహమఠం మనదేనన్నారు. డాక్టర్ వీరప్పమొయిలీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తుమకూరు మహిళా కళాశాల స్థలాన్ని కబ్జాకు ప్రయత్నించిన స్వామిజీ తన దృష్టికి తెచ్చారన్నారు. అప్పుడు సదరు స్థలాన్ని మఠానికి అందేలా చేశామన్న తృప్తి ఉందన్నారు. కార్యక్రమంలో సినీ నిర్మాత, రచయిత బీకే శ్రీనివాస్ మాట్లాడుతూ.. శివకుమారస్వామిజీ మాటలు వచనాలతో సమానమని ఆయన జయంతి అర్థవంతంగా కొనసాగాలన్నారు. బేలిమఠం శివరుద్ర మహాస్వామి, కర్ణాటక సంస్కృత విశ్వవిద్యాలయం రిటైర్డు కులపతి ప్రొఫెసర్ మల్లేపుర వెంకటేశ్, ట్రస్టు అధ్యక్షుడు టీ వెంకటేశ్‌గౌడ, ఉపాధ్యక్షులు క్రాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.

దాసోహదినంపై హర్షం

విజయపుర: సాధారణంగా ఏప్రిల్ 1వ తేదీని మూర్ఖుల దినోత్సవంగా ఆచరిస్తారని అందుకు బదులుగా సమాజంలో ఎంతో మార్పుకు కృషి చేసిన సిద్దగంగామఠాధిపతి శివకుమారస్వామిజీ జయంతిని దాసోహదినంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆచరిస్తుండడం సంతోషంగా ఉందని విజయపుర పురసభ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు ఎం సతీశ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక నవగ్రహాల కూడలిలో మహంతి మఠం, నగర్త యువజన సంఘం, నగర్త మహిళాసంఘం ఆధ్వర్యంలో శివకుమారస్వామిజీ 118వ జయంతిని పురస్కరించుకుని స్వామిజీ చిత్రపటాన్ని, సిరియాళ భావచిత్రాన్ని పురవీధులలో ఊరేగింపును ప్రారంభించి మాట్లాడారు. వసతి, ఆహారం, విద్య మూడురకాల దాసోహాలతో మఠం ద్వారా లక్షలాదిమంది విద్యార్థులలో మార్పు తెచ్చారన్నారు. కార్యక్రమంలో మహంతిమఠం అధ్యక్షుడు పునీత్‌కుమార్, నంజణ్ణ, మధు, సురేశ్‌బాబు, నగర్త యువజనసంఘం మాజీ అధ్యక్షుడు భాస్కర్, బేకరి, ఆనందప్ప తదితరులు పాల్గొన్నారు.



శివకుమార స్వామీజీ చిత్రపటం ఊరేగింపు

రూ.2.44కోట్ల మిగులుతో నగరసభ బడ్జెట్



నగరసభ అధ్యక్షుడు వెంకటస్వామి తదితరులు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నగరసభ 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.2.44 కోట్ల మిగులు బడ్జెట్ సమర్పించింది. నగరసభ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అంచనాల బడ్జెట్ సమర్పించారు. నగరసభ అధ్యక్షుడు ఎం వెంకటస్వామి అధ్యక్షత వహించారు. రూ.174,34,70,000 అంచనాల ఆదాయంగా ఉండగా రూ.171,90,45,200 వ్యయంగా మొత్తమ్మీద రూ.2.44 కోట్ల మిగులు బడ్జెట్‌ను వెంకటస్వామి సమర్పించారు. ఆస్తి పన్నుతో గరిష్ఠంగా రూ.3.27 కోట్లు ఆదాయం లక్ష్యంగా కలిగారు. ఇక నీటి బిల్లుతో రూ.52 లక్షలు, నగరసభ వాణిజ్య సముదాయాలు, ఐడిఎస్ఎంటీ సముదాయంతో బాడుగల రూపంలో రూ.29లక్షలు, ఇతర అభివృద్ధి పన్నుల రూపంలో రూ.25లక్షల ఆదాయం అంచనా లక్ష్యం కలిగారు. దుకాణాలు, పరిశ్రమలకు విధించి పన్నుతో రూ.15లక్షలు, ఖాతా బదిలీ పన్నుతో రూ.50లక్షలు, నీటి కనెక్షన్, డ్రైనేజీ కనెక్షన్‌ల పన్ను రూ.8 లక్షలు ఆదాయం లక్ష్యంగా కలిగారు. ఎస్‌టీపి గ్రాంటు రూ.95కోట్లు, అమృత్ 2.0 పథకం కింద రూ.30 కోట్లు, ఎస్ఎఫ్‌సి స్పెషల్ గ్రాంటు రూ.5కోట్లు, 15వ ఆర్థిక కమిషన్ కింద రూ.2.5కోట్లు గ్రాంటు ఆదాయంగా లెక్కించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అన్ని వార్డులలో తాగునీరు, ఉత్తమ ఆరోగ్యంకోసం స్వచ్ఛత, వీధి దీపాల నిర్వహణ, ఉద్యానవనాల అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చినట్టు వెంకటస్వామి తెలిపారు. చెత్త నిర్వహణకోసం వాహనాల కొనుగోళ్లకు రూ.1.5కోట్లు కేటాయించనున్నట్టు తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ అభివృద్ధికి రూ.60కోట్లు కేటాయించారు. ఎస్సీ ఎస్టీ సహా అన్ని వర్గాల సంక్షేమానికి సహా గ్రాంటు కేటాయించనున్నట్టు తెలిపారు. సమావేశంలో నగరసభ ఉపాధ్యక్షురాలు రూప నవీన్, ఇన్‌చార్జ్ కమిషనర్ మోహన్‌కుమార్, నగరసభ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గర్భాశయ క్యాన్సర్ రహిత సమాజమే లక్ష్యం

మహదేవపుర, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గర్భాశయ కేన్సర్ రహిత లక్ష్యంగా జీవికా ఫౌండేషన్, ఫ్యామిలి ప్లానింగ్ అసోసియేషన్ (ఎఫ్‌పిఏ) ఇండియా సహకారంతో జిఇ హెల్త్‌కేర్ సంస్థ ప్రత్యేక కార్యాచరణ నిర్వహించింది. ఇందులో భాగంగా 9-14 ఏళ్లలోపు సుమారు 1400మంది బాలికలకు గర్భాశయ కేన్సర్ సోకకుండా టీకాలు ఇవ్వదలిచారు. ప్రధానంగా హ్యూమన్ ప్యాపిలోమా వైరస్ (హెచ్‌పివి) టీకాను చిన్నవయస్సులోనే ఇవ్వడం ద్వారా గర్భాశయ కేన్సర్ రాకుండా నివారించే అవకాశం ఉందని హెల్త్‌కేర్ దక్షిణ ఆసియా ముఖ్యులు చైతన్య సారవతె అభిప్రాయపడ్డారు. దేశంలో తలెత్తిన గర్భాశయ కేసులలో సుమారు 77శాతం హెచ్‌పివి టైప్ 16, టైప్ 18గా ఉన్నాయన్నారు. తొలిదశలో భాగంగా నగరంలో మహదేవపురలో టీకాలు ఇచ్చేందుకు ప్రయోగాత్మకంగా చేపట్టినట్టు తెలిపారు. జీవికా ఫౌండేషన్ డైరెక్టర్ జిగ్నేశ్ పటేల్ మాట్లాడుతూ ప్రముఖ సంస్థ సామాజిక సేవలో భాగంగా ఫౌండే షన్‌తో కలసి టీకాలు ఇచ్చేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందని ఇందు కోసం పాఠశాల, కళాశాలల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



అవగాహన కార్యక్రమంలో వివిధ సంస్థల ముఖ్యులు

5నుంచి ప్రత్యేక నాటక ప్రదర్శనలు

బెంగళూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని కోననకుంటె ప్రాంతం ప్రిస్టేజ్ సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ప్రాంగణంలో ఈనెల 5నుంచి రెండురోజులపాటు భిన్నమైన ప్రదర్శనలు జరగనున్నాయి. 5న సాయంత్రం 7.30 గంటలకు బాలీవుడ్ అత్యుత్తమ చిత్రాలకు నృత్య ప్రదర్శనలు 'బ్లేమ్ ఇట్ ఆన్ బాలీవుడ్' జరగనున్నాయి. యశ్‌రాజ్ దర్శకత్వం వహించిన క్లాజికల్‌ను ఆస్వాదించే అవకాశం ఉంది. ఇప్పటికే దేశ విదేశాలలో స్టాండింగ్ ఒవేషన్ ద్వారా ప్రదర్శనలు సాగాయి. బెంగళూరులో సంగీత అభిమానులకోసం ఏర్పాటు చేసినట్టు ఏజీపి వరల్డ్ ఫౌండర్ ఎండీ అశ్విన్ గిద్దాని అభిప్రాయపడ్డారు. రెండున్నర దశాబ్దాలుగా ఏజీపి వరల్డ్ రంగస్థల కార్యక్రమాలను ప్రదర్శింపచేస్తోంది.

6న బార్ఫ్ నాటక ప్రదర్శన

ఆకర్షణీయమైన నాటకీయ అనుభవాల ప్రదర్శనలకు కేంద్రమైన ఏజీపి వరల్డ్ సౌరబ్‌శుక్లా నేతృత్వంలో థ్రిల్లర్ బార్ఫ్ స్నోను ఈనెల 6న ప్రిస్టేజ్ సెంటర్‌లో ప్రదర్శించనున్నట్టు అశ్విన్ గిద్దాని ప్రకటించారు. ఆస్కార్ పురస్కారం పొందిన 'స్లండాగ్ మిలియనీర్' సినిమాతో పేరొం దిన సౌరబ్ శుక్లా రచించి దర్శకత్వం వహించి 'బార్ఫ్' హిందీ నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్టు తెలిసారు. సాయంత్రం 7.30 గంటలకు నాటకం ఉంటుందన్నారు.

అలరించిన ఉగాది వేడుకలు



మహిళల బృందగాయనం

బెంగళూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మైసూరులో ఆరు దశాబ్దాలపాటు సేవలందిస్తున్న తెలుగు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో విశ్వావసు ఉగాది వేడుకలు రామకృష్ణనగర్‌లోని వీడీ రెడ్డి తెలుగు భవనంలో మనోరంజకంగా సాగాయి. మా తెలుగుతల్లికి ప్రార్థనాగీతంతో ప్రారంభించి పంచాంగశ్రవణం అనంతరం ఉగాదిపచ్చడి పంపిణీ చేశారు. పిల్లల భరతనాట్యాలు, మహిళల బృంద గాయనం, సీనియర్ సిటిజన్స్ కవితాగానం వంటివి అన్నివర్గాల వారిని అలరించాయి. హేమచంద్రరాజు నేతృత్వంలో పాడుతాం తీయగా పేరిట పాత సినీ పాటలు ఆలపించగా ఆహ్లాదపరిచాయి. లాస్య, వేద, వాగ్దేవిలు ప్రదర్శించిన నవరసభరితమైన నాట్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. చక్రపాణి మధురగానం, ప్రభాకరశాస్త్రిల కవితాలహరి కార్యక్రమాలు పరవశింపచేశాయి. ఇదే సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10, 12 తరగతుల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. వ్యాఖ్యాతగా విశ్వనాథ్ వ్యవహరించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి శ్రీరామ్, ఉపకార్యదర్శి వరలక్ష్మి, కోశాధికారి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మీలు పడి విద్యార్థికి గాయాలు



విద్యార్థి కాలిపై పడిన కమ్మీలను తొలగిస్తున్న దృశ్యం

చింతామణి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రూ.15కోట్లతో నిర్మాణాలు సాగుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఇనుపకమ్మీలు పడి ఒక విద్యార్థి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఫస్ట్ ఇయర్ మెకానికల్ విద్యార్థి, అంజని లే అవుట్‌కు చెందిన శివచరణ్ గాయపడ్డాడు. సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడంతోనే సమస్య తలెత్తినట్టు తెలుస్తోంది. సుమారు 40అడుగుల పొడవైన ఇనుప కమ్మీల లోడ్‌తో వచ్చిన లారీ కళాశాల ఆవరణకు వచ్చింది. క్రేన్ సాయంతో కమ్మీలు దించుతున్న వేళ అదుపు తప్పి కిందపడ్డాయి. కాలికి తీవ్రంగా గాయాలైన విద్యార్థిని స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం బెంగళూరుకు తరలించారు. కళాశాల ఆవరణలో సరైన భద్రతా చర్యలు చేపట్టాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

అప్పు తీర్చేందుకు హత్య

యూ ట్యూబ్ చూసి ప్రణాళిక

మహిళ ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

నాలుగు నెలల తరువాత వెలుగులోకి వ్యవహారం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, ట్రైనీ డీఎస్పీ తదితరులు

మడకశిర టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పొరుగింట్లో ఉన్న మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అప్పులు తీర్చేందుకు ఆమె బంగారంపై కన్నేశాడు. హత్య ఎలా చేయాలో యూ ట్యూబ్‌లో చూసి తెలుసుకున్నాడు. ఆమెను అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి కడతేర్చాడు. మడకశిర మండలం ఉగ్రేపల్లి అటవీ ప్రాంతంలో నాలుగు నెలల క్రితం జరిగిన ఈ హత్య కేసును ట్రెయినీ డీఎస్పీ ఉదయపావని, సీఐ రాజ్‌కుమార్ ఛేదించారు. పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ట్రెయినీ డీఎస్పీ ఉదయపావని మంగళవారం కేసు వివరాలను విలేకరులకు తెలిపారు. కదిరేపల్లికి చెందిన బి.నరసింహమూర్తి పావగడ నియోజకవర్గంలోని అరసికెరెకు చెందిన ఉమాదేవితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఉమాదేవి బెంగళూరులో ఓ గార్మెంట్ పరిశ్రమలో పనిచేస్తున్న సమయంలో నరసింహమూర్తితో ఆమెకు పరిచయం ఏర్పడింది. అది వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ క్రమంలో అప్పుల్లో ఉన్న నరసింహమూర్తి కన్ను ఉమాదేవి వద్ద ఉన్న బంగారంపై పడింది. ఉమాదేవి అరసికెరెలో ఉండగా నరసింహమూర్తి ఫోన్‌చేసి కదిరేపల్లికి రమ్మన్నాడు. అప్పటికే యూట్యూబ్ ద్వారా మహిళను ఎలా హత్యచేయాలలో తెలుసుకుని, అవసరమైన తాడును సిద్ధం చేసుకున్నాడు. మడకశిరకు వచ్చిన ఆమెను ఉగ్రేపల్లి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ తాడుతో చేతులను కట్టేసి హత్య చేశాడు. మృతదేహాన్ని అక్కడే పూడ్చి, ఆధారాలు లేకుండా చేసి, బెంగళూరుకు వెళ్లిపోయాడు. కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గత నెల 15న గుర్తించారు. అప్పటికే అరసికెరెలో మిస్సింగ్ కేసు నమోదు కావడంతో ఉమాదేవి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. మృతదేహం కాళ్లకు ఉన్న పట్టీలు, ఇతర ఆనవాళ్లను వారు గుర్తించారు. ట్రెయినీ డీఎస్పీ ఉదయపావని ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఈ కేసును దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేసింది. ఉమాదేవికి చెందిన బంగారు మంగళసూత్రం గొలుసు, కమ్మలు, ముక్కుపుడక తదితర ఆభరణాలను నిందితుడు కుదువపెట్టి డబ్బు తీసుకున్నట్లు విచారణలో తేలింది. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో అర్బన్ సీఐ నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అవమానించారని ఆత్మహత్య

కనగానపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తగరకుంటలో ఓబిరెడ్డి(32) అనే వ్యక్తి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తగరకుంట, కేకే తండాకు చెందిన కొందరు అవమానించినందుకే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఓబిరెడ్డి తండ్రి సుబ్బిరెడ్డి, కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓబిరెడ్డి ఎంబీఏ మధ్యలో మానేసి తండ్రికి తోడుగా వ్యవసాయ పనులు చేసేవాడు. తల్లిదండ్రులు గ్రామ శివారులోని ఆవులషెడ్‌లో ఉంటున్నారు. ఓబిరెడ్డి తగరకుంటలోని ఇంటిలో ఉండేవాడు. ఓబిరెడ్డిని కలిసేందుకు మంగళవారం ఉదయం అతని స్నేహితులు వెళ్లారు. అప్పటికే ఇంటి దూలానికి ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో వారు డయల్ 100 ఫోన్ చేసి విషయం తెలియజేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు. ఈ ప్రాంతంలో ఐపీఎల్ బెట్టింగ్ బాగా జరుగుతోంది.

మద్యానికి బానిసై..

తాడిపత్రి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటాంపల్లిలో చిన్నవజీర్ (22) అనే యువకుడు మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న చిన్న వజీర్.. మద్యానికి బానియ్యాడని, పనులు లేకపోవడంతో దిక్కుతోచక ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు.

టమోటా కిలో రూ. 8

అనంతపురం రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 8తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 90 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

హళెహళ్లిలో కబడ్డీ పోటీలు



ట్రోఫీతో విజేత జట్టు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఈ తిమ్మ సంద్ర గ్రామ పంచాయతీ పరిధిలోని హళెహళ్లిలో విద్యాగణపతి సేవా సమితి ఆధ్వర్యంలో ఫ్లడ్‌లైట్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీలకు సమాజసేవకుడు, పారిశ్రామికవేత్త సందీప్‌రెడ్డి సహకారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పండుగ వేళ యువత పేకాట వంటి ఇతరత్రా కార్య క్రమాలకు బదులు క్రీడాపోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించేలా చేప ట్టామన్నారు. ఇందుకు యువకులు సైతం ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. హిందూ ముస్లిం భేదాలు లేకుండా కలసికట్టుగా పండుగల వేళ పాల్గొన్నారన్నారు. క్రీడాకారులందరికీ తగిన సదుపాయం కల్పించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కబడ్డీ పోటీల విజేతలకు తొలి బహు మతిగా రూ.15వేలు, ట్రోఫీ, రెండో బహుమతిగా రూ.10వేలు, తృతీయ బహుమతిగా రూ.5వేలు అందచేశారు. కార్యక్రమంలో విద్యాగణపతి సేవాసమితి సభ్యులు, హళెహళ్ళి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్లు నిర్మించండి..




రామనుపడి గ్రామ బస్టాప్ ప్రదేశం

చేళూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని రామనుపడి, హొస హుడ్య, బురడగుంటె గ్రామాలలో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని గ్రామ స్థులు కోరుతున్నారు. ప్రతిరోజూ ఈ గ్రామాలనుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల ఉన్నారు. రైతులు సమీపంలోని తాలూకా కేంద్రమైన చేళూరుకు రాకపోకలు కొనసాగిస్తున్నారు. అయినా గ్రామంలో కనీసం బస్‌షెల్టర్ లేదని సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరు తున్నారు. కాగా పులగల్లు, చాకవేలు, కోళ్లవారిపల్లి క్రాస్ వద్ద, ఏనిగదలె తదితర గ్రామాలలోని బస్ షెల్టర్ ప్రదేశాలలో స్వచ్ఛత కొరవడిందని కనీసంగా బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



హొసహుడ్య గ్రామ బస్టాప్



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1590.00	1,580.50
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,761	926
నీటి నిల్వ (టీఎంసీలు)	11.03	4.72

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి: డీహెచ్‌ఓ

బళ్లారి సిటీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండతీవ్రత పెరుగుతున్నందున గర్భిణులు జాగ్రత్త పాటించాలని, మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి బయటకు రాకూడదని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ(డీహెచ్‌ఓ) అధికారి రమేశ్‌బాబు తెలిపారు. మంగళవారం కురుగోడు తాలూకాలోని కోళూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన మీడియాతో మాట్లాడారు. మధ్యాహ్నం 12గంటల నుంచి సాయత్రం 3గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, గర్భిణులు ఇంట్లోనే ఉండాలని కుటుంబ సభ్యులు కూడా వారి ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. శరీరంలో నీరు తగ్గిపోకుండా చూసుకోవాలన్నారు. వేసవి నేపథ్యంలో పాలిచ్చే తల్లులు తమ నవజాత శిశువులకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. బిడ్డకు రోజుకు కనీసం 10నుండి 12సార్లు కానీ బిడ్డ ఏడ్చినప్పుడల్లా తల్లిపాలు ఇవ్వాలని ఆయన సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులు వారి కుటుంబ సభ్యులలో నిర్జలీకరణాన్ని నివారించడానికి అన్ని ఆరోగ్య కేంద్రాలలో ఇప్పటికే ఓఆర్‌ఎస్ అందుబాటులో ఉందన్నారు. ఆసుపత్రి సందర్శనల సమయంలో ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తీసుకోవడం ద్వారా శరీరంలో నిర్జలీకరణ ప్రమాదాలను నివారించవచ్చని ఆయన అన్నారు. వడదెబ్బ వల్లకలిగే సమస్యలను నివారించడానిక,తక్షణ చికిత్స అందించడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీత హెల్త్ సెంటర్లలో ఒక్కొక్క మంచం , తాలూకా పబ్లిక్ హాస్పిటల్లో 2పడకలను రిజర్వు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని గ్రామ స్థాయిలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌తోసహా అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వడదెబ్బ చికిత్సకు సంబంధించిన అత్యవసర మందులు నిల్వ చేయబడి ఉన్నాయని , కొరతలేకుండా చూసుకుంటామన్నారు. ఈసందర్భంగా తార్‌నాథ్ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్,ఆయుష్ ఆచార్యులు డాక్టర్, రాజశేఖర్, డాక్టర్ ఫణీంద్ర,డాక్టర్ కల్యాణి, జిల్లాఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్‌దాసప్పనవర్, సూపరింటెండెంట్ బసవరాజ్, హెల్త్‌ఇన్స్‌పెక్టర్ వీరేశ్, భద్రతాధికారిణి శరణమ్మ, ప్రజాప్రతినిధి కృష్ణమ్మ, రాధమ్మ తదితరులున్నారు.



కోళూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డీహెచ్‌ఓ రమేష్ బాబు

జూలై 12న జాతీయ లోక్ అదాలత్



న్యాయాధికారి శాంతి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ జూలై 12న నగరంలోని తాలూర్ రోడ్డు కొత్త జిల్లా కోర్టు సముదాయంలో జాతీయ లోక్ లదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లాలీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ శాంతి ఒక ప్రకటనలో తెలిపారు. బళ్లారి, విజయనగరం జిల్లాల్లోని మొత్తం 31కోర్టుల్లో లోక్ అదాలత్ ద్వారా ప్రజలు తమ ప్రీ-లిటిగేషన్, కన్సిలియేటబుల్ కేసులు, చెక్ కేసులు, బ్యాంకు కేసులు, మోటారు వాహన ప్రమాద హరిహార ట్రిబ్యునల్ కేసులు, వైవాహిక, కుటుంబ కేసులు, సివిల్ కేసులను పరిష్కరించు కోవచ్చన్నారు. వివరాలకు జిల్లా న్యాయసేవల అథారిటీ కార్యాలయాన్ని లేదా ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చు. 08392- 278077 కు సంప్రదించాలన్నారు.



గ్రామంలో ట్యాంకర్లతో నీరందిస్తున్న అధికారులు

శివలింగనహాళ్లిలో నీటి ఎద్దడి

కంప్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే బళ్లారి, విజయనగర్ జిల్లాలో పలు గ్రామాల్లో నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏటా నీటి కరువుతో విలవిలలాడుతున్నా పట్టించుకునే వారే లేరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు ఈ సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు తెలిపిన నిర్లక్ష్యం వహిస్తున్నారు. అందుకని ఇప్పటికే గ్రామాల్లో నీటి సమస్య తప్పదని తెలుపుతున్నారు. వేసవి తాపంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చడంతో ట్యూబ్‌వెల్ మోటార్ కాలిపోవడంతో మహిళలు, పురుషులు నీటి కోసం పొలాల్లోకి తిరుగుతున్నారు. తాలుకాలోని పరిధిలోని శివ లింగనహాళ్లిలో నీటి సమస్య ఏర్పడి ప్రజలు, పశువులు తాగుననీటికి అవస్థలు పడుతున్నారు. గ్రామ అధికారులు గ్రామానికి తాగునీరు అందించేందుకు అయ్యనహాళ్లి సమీపంలో నిర్మించిన బహుళ గ్రామాల తాగునీటి పథకం ద్వారా తుంగభద్ర నది నీటిని సరఫరా చేస్తున్నారు. ఇక ముందు నీటి సమస్య తలెత్తకుండా చేపడతామని తెలిపారు.

ఘనంగా శివకుమార స్వామీజీ జయంతి



కంప్లిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ముఖ్యాధికారి దుర్గన్న



కొత్తూరు స్వామి మఠంలో స్వామీజీకి పూజలు

కంప్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పేటే బసవేశ్వరాలయం ప్రాంగణంలో మంగళవారం శివకుమార స్వామీజీ జయంతి సందర్భంగా సజ్జనస్ వీరభద్రప్ప, శరణప్ప సజ్జన కుటుంబ సభ్యులు, జేసీఐ సోనా యూనిట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. బసవేశ్వరాలయం ముందు ఏర్పాటు చేసిన వేదికపై శివకుమార స్వామి గల చిత్రపటానికి మున్సిపల్ ముఖ్యాధికారి దురుగన్న నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాలలు వేశారు. అనంతరం ముఖ్యాధికారి దురుగన్న మాట్లాడుతూ శివకుమారస్వామీజీ ఆదర్శప్రాయుడని, ఆయన జీవిత చరిత్రను, తత్వాలను అలవరుచుకోవాలన్నారు. ఈ సమయంలో కంప్లి సోనా యూనిట్ అధ్యక్షుడు రసూల్ మాట్లాడుతూ తుమకూరు సిద్దగంగ మఠానికి చెందిన త్రివిధదాసోహి కర్ణాటక రత్న, పద్మభూషణ్ నడిచే దేవుడు శివకుమార మహాస్వామి 118వ జయంతిని జరుపుకోవడం ఎంతో సంతోషించే విషయమన్నారు. ఈ కార్యక్రమంలో రసూల్ మాజీ ఉపాధ్యక్షుడు సంతోష్ కొట్రప్ప, సోగి యూనిట్, మాజీ అధ్యక్షులు బడిగెర జిలాన్ సాబ్, చంద్రశేఖర్‌గౌడ్, ఇంతియాజ్, డి భరత్, డాక్టర్ భరత్ పద్మశాలి, గురువు సిద్దరామేశ్వర శాస్త్రి, మనోజ్ కుమార దానప్ప, కనక రాయ, డి ఇస్మాయిల్, యూసుఫ్, మున్సిపల్ సీనియర్ హెల్త్ ఇన్స్‌పెక్టర్ ప్రకాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు స్వామి మఠంలో..

బళ్లారిరూరల్(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో శివకుమార్ మహాయోగి 118వ జయంతి వేడుకలను భక్తిశ్రద్దలతో అఖిల భారత వీరశైవ మహాసభ కొత్తూరు స్వామి మఠంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అఖిల కర్ణాటక వీరశైవ వివిధ ప్రముఖులు హాజరయ్యారు. సిద్దగంగ జయంతి వేడుకలు సందర్భంగా రైల్వే పోరాట సమితి శ్రీ మహేశ్వరస్వామి అధ్యక్షులు చానాల్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొళగల్లు జాతర నిలిపివేత

● కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా



బళ్లారి సిటీ,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బళ్లారి తాలూకాలోని కొళగల్లు గ్రామంలో ఏప్రిల్ 4న జరగనున్న ఎర్రితాత వార్షిక జాతరను నిలిపివేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఆదేశించారు. కొళగల్లు గ్రామంలోని సద్గురు ఎర్రితాత ఆలయ ఆస్తి, పరిపాలనపై వివాదం ఉందన్నారు. ఫిబ్రవరి 24, 2024న మఠంలో ప్రాంగణంలో కొత్తగా ఎర్రితాత ఆలయంలో ప్రతిష్టించిన విగ్రహాన్ని తొలగించాలని హైకోర్టు అదేశాల మేరకు విగ్రహాన్ని తొలగించామన్నారు. దీంతో వివిధ వర్గాల మధ్య వివాదం కొనసాగుతోందన్నారు. శాంతిభద్రతల దృష్ట్యా రథోత్సవాన్ని నిలిపివేసినట్లు ఎస్పీ శోభారాణి కూడా ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

షెడ్యూల్డ్ బ్యాంకు దిశగా 'వికాస్'



మాట్లాడుతున్న వికాస్ బ్యాంకు చైర్మన్ విశ్వనాథ్ హిరేమఠ్

బళ్లారి సిటీ,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో విస్తరించి, హొసపేటలో ప్రధాన కార్యాలయం కలిగిన వికాస్ సౌహార్ద కో ఆపరేటివ్ బ్యాంక్ రూ.1000కోట్లకు పైబడి డిపాజిట్లను సేకరించిందని, షెడ్యూల్డ్ బ్యాంక్ హోదా పొందే దిశగా ఉందని బ్యాంక్ చైర్మన్ విశ్వనాథ్ హిరేమఠ్ అన్నారు. హొసపేటలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే మార్చి వరకు ఇది పనితీరు కొనసాగితే బ్యాంక్‌కు షెడ్యూల్డ్ గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఒకే ఒక సహకార బ్యాంకుకు షెడ్యూల్డ్ హోదా లభించిందని, 10నుంచి 12బ్యాంకులు ఇటువంటి ప్రయత్నం చేస్తున్నాయని, వాటిలో వికాస్ బ్యాంక్ ఒకటి అని చెప్పడానికి గర్వపడుతున్నానని ఆయన అన్నారు. ప్రస్తుతం బ్యాంకుకు 18శాఖలు పనిచేస్తున్నాయి. కొత్త ప్రధాన కార్యాలయ భవనం నిర్మాణం దాదాపు పని పూర్తి కావస్తోంది. ఆగస్టునాటికి ప్రారభించనున్నారు. బ్యాంక్ డైరెక్టర్ల బోర్డులో చైర్మన్ బి.జె. కులకర్ణి, చందా హుస్సేన్, దివాకర్,రమేశ్ పురోహిత్, వికాస్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రసన్న హిరేమట్ ఉన్నారు.

హాస్యంతో సంపూర్ణ ఆరోగ్యం

సిరుగుప్ప, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): హాస్యంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కళాశ్రీ నాటక అకాడమీ అధ్యక్షులు హనుమంతరెడ్డి తెలిపారు. మంగళవారం తాలుకా లోని బీఎం సూగూరు గ్రామంలో కళాశ్రీ నాటక అకాడమీ ఆధ్వర్యంలో మిమిక్రీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి హనుమంతరెడ్డి మాట్లాడుతూ నేటి రోజుల్లో మనిషి ప్రతినిత్యం ఆలోచనలు, సమస్యలతో మానసిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వీటన్నింటి నుంచి మనిషి మేల్కొనేందుకు హాస్యభరితమైన నాటకాలు, మిమిక్రీలు అత్యవసరమన్నారు. మనిషి జీవితం ఉల్లాసంగా, ఉత్సాహంగా జీవించేందుకు ఎలాంటి ఆలోచనలకు గురికారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా మిమిక్రీ కళాకారులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో మిమిక్రీ జరిగింది. గ్రామప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గ్రామప్రముఖులు మారుతి, వరప్రసాద్ రెడ్డి, పంచాయతీ సభ్యులు, కళాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

సీఎం పతకానికి పోలీసుల ఎంపిక



అవార్డుకు ఎంపికైన పోలీసు అధికారులు

కంప్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హోమ్ శాఖ ప్రతి యేటా ఉత్తమ సేవలు చేపట్టిన పోలీసు శాఖలో జిల్లా వారీగా గుర్తించి వారికి సీయం, హోమ్ శాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డును అందిస్తారు. ఈ యేడాది విజయనగర జిల్లాలో ముగ్గురు పోలీసులు ఉత్తమ సేవలు చేపట్టి సీయం అవార్డుకు ఎంపికయ్యారు. డీఏఆర్ సీఐ జి శశి కుమార్, హొస్పేట రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ హెచ్ నాగరత్న, గుడేకోట పోలీస్‌స్టేషన్ల హెడ్ కానిస్టేబుల్ కొట్రేష్ చిమ్మల్లి ముఖ్యమంత్రి పతకానికి ఎంపికయ్యారు. జిల్లాలోని పోలీసు శాఖ అధికారులు ఆ ముగ్గురిని అభినందించారు.

ఉత్తమ సేవకు అవార్డు

: కంప్లి పోలీస్ స్టేషన్లో సీఐగా విధులు నిర్వహిస్తున్న వాసు కుమార్ బుధవారం బెంగళూరులో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, హోం శాఖ మంత్రి పరమేశ్వరప్ప చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు జిల్లా పోలీసు శాఖ అధికారులు తెలిపారు. ఆయన సేవలు గుర్తించే ఈ అవార్డు దక్కిందని తెలిపారు. ఈయనకు ఉత్తమ సేవ అవార్డు రావడంతో కంప్లిలో ప్రజాప్రతినిధులు, పోలీసు శాఖ ఆయనను అభినందించారు.

నగదు, బైక్‌ల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

గంగావతి రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఉదమకల్ గ్రామం సమీపంలోని సోలార్ ప్లాంట్ వద్ద ఇస్పేట్, స్పీడ్‌వే ఆడుతున్న వారిపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. గంగావతి రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ రంగప్ప దొడ్డమని తెలిపిన వివరాల మేరకు రూ.39వేల నగదు, 26బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేసినట్లు తెలపారు. కొందరిని అదుపులోకి తీసుకోగా మరికొందరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సిబ్బంది బసవరాజ చిన్నూరు, రాఘవేంద్ర, మంజునాథ్, బసవరాజ, మురుడి, ముత్తురాజు, అమరేశ్ పాల్గొన్నారు. ఈ ఘటనపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

జోడురథాల ఆవిష్కరణ



నూతన రథాలు

కంప్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పురస్కరించుకుని మరియమ్మనహళ్లిలోని ప్రసిద్ది గాంచిన లక్ష్మీనారాయణ స్వామి, ఆంజనేయస్వామి దేవస్థానాల జోడు రథాలను సిద్ధం అయ్యాయని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు ఉత్తరాది మఠం శ్రీ సత్యాత్మతీర్థాల సతీష్, గోవింద, పరశురాములు మంగళవారం తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాత విరాళం సహాయంతోనే సుమారు రూ.4 కోట్లతో నూతన జోడు రథాలను సిద్ధం చేశామన్నారు. శ్రీరామ నవమి సందర్భంగా జరుపుకునే రథోత్సవంను పట్టణంలో ప్రతిఒక్కరు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. కులమత బేధాలు లేకుండా ముందుకొచ్చి ప్రతి పండుగను వైభవంగా జరుపుకుందామని తెలిపారు.

హోసూరు జోన్

తగ్గిన బీట్‌రూట్ ధర



బీట్‌రూట్ పంట

హోసూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా పండించే పంటలలో బీట్‌రూట్ ఒకటి. బగళూరు చుట్టుపక్కల ప్రాంతాలలో బీట్‌రూట్ ఎక్కువగా పండిస్తున్నారు. గత ఏడాది కిలో రూ.60 వరకు పలికింది. ప్రస్తుతం పంట దిగుబడి పెరిగి డిమాండ్ తగ్గడంతో ధర తగ్గింది. కానీ కొద్దిరోజులుగా కిలో రూ.5 నుంచి 10వరకు మాత్రమే పలుకుతుండడంతో కూలిబాటు కూడా రావడం లేదని పంటను తోటల్లోనే వదిలేస్తున్నారు. ఈ సంవత్సరం స్థానికంగా 120 ఎకరాలలో బీట్‌రూట్ సాగు చేయడమే ధర తగ్గడానికి కారణమని తెలుస్తోంది. నూకోల్, బీన్స్ వంటి వాటిని సాగు చేయాలని ఉద్యానవనశాఖ అధికారులు సూచించినా పట్టించుకోకపోవడంతోనే సమస్య తలెత్తిందని తెలుస్తోంది.

చెరువును శుభ్రపరచాలని వినతి

హొసూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): హోసూరు దర్గా సమీపానగల చంద్రంబ్డై చెరువులో గుర్రపుడెక్క ఆకు పెరిగింది. నిరంతరం నీటితో ఉండే చెరువులో విదేశీపక్షులు కూడా ఉండేవి. ఇటీవలకాలంలో చెరువు కాలుష్యం బారిన పడుతుండగా మరోవైపు గుర్రపుడెక్క ఆకుతో నిండింది. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు మాంసపు వ్యర్థాలు, చెత్తా చెదారం పడేస్తున్నారు. చెరువు పక్కనుంచి వెళ్లాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. డంపింగ్ యార్డుగా మారకముందే బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గుర్రపుడెక్కతో నిండిన చెరువు



అలంకరణలో స్వామి, అమ్మవారు

ఘనంగా గిరిజా కల్యాణం

హొసూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రసిద్ధ బాలమురుగన్ ఆలయంలో గిరిజా కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గంగాభిషేకం, స్వామివారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. సంప్రదాయంగా కాశీయాత్ర చేపట్టి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం పురవీధులలో స్వామివార్లను ఊరేగించారు. లక్ష్మణన్, మీనాక్షి సుందరం, శివకుమార్ వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఉదయం, సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాన్ని విశేషంగా అలంకరించారు.

అన్నాడీఎంకే కమిటీ సమావేశం



సమావేశంలో అన్నాడీఎంకే కార్యకర్తలు, నాయకులు

హొసూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): హోసూరు నియోజకవర్గంలోని దిన్నూరు ప్రాంతంలో అన్నాడీఎంకే పార్టీ బూత్ కమిటీ నాయకుల సమావేశం జరిగింది. పార్టీ ప్రాంతీయ కార్యదర్శి వాసుదేవన్ ఆధ్వర్యంలో బూత్ కమిటీ సభ్యుల నియామకంపై చర్చలు జరిగాయి. నియోజకవర్గ ఎన్నికల జిల్లా ఇన్‌చార్జ్ పన్నీర్‌సెల్వం, కృష్ణగిరి పశ్చిమజిల్లా కార్యదర్శి బాలకృష్ణారెడ్డి సూచనల మేరకు సమావేశం నిర్వహించారు. సమావేశంలో లలక్ష్మీ హేమకుమార్, సర్కిల్ కార్యదర్శి గోపాలరామచంద్రన్, చిట్టిజగదీశ్, చంద్రన్న పాల్గొన్నారు.

బ్యాంకులో బంగారం మాయం..!

● నకిలీ ఆభరణాలతో టోకరా
● ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు



ఎస్పీ పుట్ట మాదయ్యకు ఫిర్యాదు చేస్తున్న మోహన్ రెడ్డి

రాయచూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు చెందిన రాయచూరు నగర శాఖలో తాకట్టు పెట్టిన బంగారం వస్తువులు మాయమైయ్యాయి. అసలి బంగారం నగల స్థానంలో నకిలీ వస్తువులను చేర్చి ఖాతాదారులను మోసగించిన సంఘటన వెలుగు చూసింది. నగరంలోని నిజలింగప్ప కాలనీకి చెందిన మోహన్ రెడ్డి అనే వ్యక్తి 2022 మార్చి 3న తన పిత్రార్జితమైన బంగారు ఆభరణాలను బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నగర శాఖలో తాకట్టు పెట్టాడు. వాటి విలును జ్యువెలరీ షాప్‌లో చూయించి రూ.13 లక్షల 90 వేలు ఉంటుందని అంచనా వేయగా బ్యాంక్ నిబంధనల మేరకు ఆయనకు రూ.8.50 లక్షల రుణం ఇచ్చారు. ఆ రుణంలో ఇప్పటి వరకు సగం తీర్చిన మోహన్ రెడ్డి మిగతా సగాన్ని తీర్చేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో ఇటీవల మహారాష్ట్ర బ్యాంకులో జరిగిన మోసం వార్తలు వెలుగు చూడడంతో తన బంగారాన్ని పరిశీలించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడున్నవి నకిలీవిగా తేలడంతో హతాసులయ్యాడు. తనకు అసలు బంగారు నగలు ఇప్పించాలంటూ బ్యాంకు అధికారులపై మంగళవారం జిల్లా ఎస్పీ పుట్టమాదయ్యను కలిసి ఫిర్యాదు చేశాడు. కాగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మేనేజర్ నరేంద్ర రెడ్డి ఇటీవలే నకిలీ ఖాతాదారుల పేరుతో బంగారాన్ని కుదువ పెట్టి దాదాపు రూ.10 కోట్ల మేరకు రుణాలు మంజూరు చేయగా అవన్ని నకిలీవిగా అధికారులు గుర్తించారు. వీటి పై బ్యాంక్ రీజనల్ మేనేజర్ సతీశ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మేనేజర్ నరేంద్ర రెడ్డి పరారీలో ఉన్నాడు. దీంతో ఆ బ్యాంకులో బంగారం కుదువ పెట్టిన ఖాతాదారుల్లో ఒక్కసారిగా ఆందోళన మొదలైంది.

ఎస్పీ కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా

రాయచూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఈశ్వర నగర్‌కు చెందిన వీరేశ్(38) మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృత్యువాతపడ్డాడు. నగరంలోని వెస్ట్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసులు దాడి చేయడం వల్లే వీరేశ్ మృతి చెందాడంటు కుటుంబ సభ్యులు ఆరోపించిన నేపథ్యంలో బీజేపీ నాయకులు ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సిటీ ఎమ్మెల్యే శివరాజ్ పాటీల్ నేతృత్వంలోని బీజేపీ నాయకులుఏ దాడికి బాధ్యులైన పోలీసులను వెంటనే విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.